




సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

మంగళవారం 19-8-2025

సంపుటి: 21 సంచిక: 126
పేజీలు: 8 వెల: రూ.1






## బ్యాంకు కట్టల్లోనే

# నకిలీ పాములు?

- ఏటీఎంలలో పట్టే కరెన్సీపై షార్టేజ్, నకిలీ ఫిర్యాదులు
- అడిగితే తీసుకున్నప్పుడే లెక్కపెట్టుకుని, పరిశీలించాలని దబాయింపులు
- చాలామంది నష్టపోతున్నా.. ఫిర్యాదులు కొన్నే
- బ్యాంకుల స్థాయిలోనే నకిలీ మకిలి అంటుతోందన్న ఆరోపణలు
- వీటిపైనే దృష్టి సారించిన జిల్లా పోలీసులు




నగరంలోని ఓ లాడ్జిలో ఇటీవల నకిలీ నోట్లతో కొందరు పట్టుబడిన కేసు మూలలను జిల్లా పోలీసులు కదిలిస్తున్నారు. నగర నడిబొడ్డులో నకిలీ నోట్ల చెలామణీ ఎలా జరుగుతుందన్న దానిపై స్వయంగా ఎస్పీ మహేశ్వర్ రెడ్డే ఆరా తీశారు. జిల్లాలో పెద్ద ఇంటెలిజెన్స్ వ్యవస్థ ఉన్నా చిక్కలేదంటే.. ఒక ప్రణాళిక ప్రకారమే దొంగనోట్ల చెలామణీ జరుగుతుందని భావించిన జిల్లా పోలీసులు దీని వెనుక ఉన్న సూత్రధారులు, పాత్రధారులను కనిపెట్టే పనిలో పడ్డారు. దొంగనోట్ల దందా వ్యవస్థీకృతమైపోయిందని.. కేవలం ఒకరిద్దరిని పట్టుకున్నంత మాత్రాన పని కాదన్న కోణంలో పోలీసు దర్యాప్తు జరుగుతోంది.

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కొద్ది నెలల క్రితం నగరంలోని పాలకొండ రోడ్డులో ఉన్న ఓ కార్పొరేట్ జ్యూయలరీ షాపునకు వెళ్లిన ఓ వ్యక్తి నగలు కొనుగోలు చేసిన తర్వాత రూ.500 నోట్ల కట్ట ఇచ్చాడు. అందులో నాలుగు నకిలీ నోట్లు ఉన్నట్లు షాపు సిబ్బంది గుర్తించారు. తాను బంగారం షాపునకు రావడానికి ముందే బ్యాంకులో నగదు విత్‌డ్రా చేసి తీసుకొచ్చానని, అందులో నకిలీ నోట్లు ఉండటమేమిటని షాపు సిబ్బందితో కొనుగోలు దారుడు వాదులాటకు దిగాడు. తమ వద్ద అధునాతన కౌంటింగ్ కమ్ స్కానర్ మిషన్ ఉందని, కావాలంటే మీరే పరిశీలించుకోండంటూ షాపువారు ఆధారాలు చూపించడంతో పాటు ఇలాంటి నోట్లు తమ వద్దకు రాగానే చించేయాలనే నిబంధన ఉండటం వల్ల నాలుగు ఐదువందల నోట్లను కస్టమర్ ముందే చించేశారు. దీంతో ఖాతాదారుడు సంబంధిత బ్యాంకు వద్దకు వెళ్లి - మిగతా చివరి పేజీలో




## నియామకాల్లో


# నిబంధనలు 'అవుట్'!



- అరసవల్లిలో 46 అవుట్ సోర్సింగ్ పోస్టులకు టెండర్లు
- జీరో కమీషన్ బిడ్లపై ఈవో ద్వంద్వ వైఖరి
- ముందు చెల్లవని ప్రకటన.. ఆనక వాటికి అనుమతి
- తనకు అనుకూలమైన వారికి కట్టబెట్టే ఎత్తుగడ
- స్థానిక యువత వేసిన టెండర్ తిరస్కరణ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

అవుట్ సోర్సింగ్ సిబ్బంది నియామక ప్రక్రియలో అరసవల్లి దేవస్థానం అధికారులు నిబంధనలకు నీళ్లొదులుతున్నారు. తమకు కావలసినవారికి ఆ పోస్టులు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తున్నారన్న - మిగతా చివరి పేజీలో



• ఎడిటోరియల్

# ఎన్నికల సంఘం నిబద్ధత ప్రశ్నార్థకం!

ఎన్నికల సంఘం స్వతంత్ర వ్యవస్థ. నేరుగా రాజ్యాంగ అధినేత అయిన రాష్ట్రపతికే జవాబుదారీగా ఉంటూ పారదర్శకంగా పని చేయాల్సి ఉంటుంది. కేంద్ర ప్రభుత్వానికి కూడా దాన్ని నియంత్రించే లేదా శాసించే అధికారాలు లేవు. రాగద్వేషాలకు అతీతంగా, పక్షపాతరహితంగా ఓటర్ల జాబితాల మార్పులు చేర్పులు, నిష్పాక్షికంగా ఎన్నికలు నిర్వహించడం ద్వారా ప్రజా ప్రభుత్వాల ఏర్పాటుకు బాటలు వేయడం ఎన్నికల సంఘానికి రాజ్యాంగం అప్పగించిన ప్రధాన బాధ్యతలు. వాటిలో ఒకటైన ఓటర్ల జాబితాల్లో మార్పులపై నెలకొన్న సందేహాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత కూడా ఎన్నికల సంఘానిదే. కానీ ప్రతిపక్షం ఓటర్ల జాబితాల్లో అక్రమ తొలగింపులు జరిగాయని కొన్ని ఉదాహరణలతో ఆరోపిస్తూంటే.. ఎన్నికల సంఘం పట్టించుకోకపోగా వాటిని రుజువు చేయాలని తిరిగి ప్రతిపక్షాన్నే దబాయిస్తుండటం ఆ వ్యవస్థ విశ్వసనీయతనే ప్రశ్నార్థకం చేస్తోంది. కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు రాహుల్‌గాంధీ చేసిన, చేస్తున్న ఓట్ల చోరీ ఆరోపణలపై మీడియా సమావేశంలో ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) జ్ఞానేష్‌కుమార్ నేతృత్వంలోని ఎన్నికల సంఘం స్పందించిన తీరు ఒక సాధారణ ప్రభుత్వ సంస్థను తలపించింది. ప్రభుత్వం తరపున వారు మాట్లాడుతున్న భావన కలిగించాయి. ఓట్ల చోరీ జరిగిందన్న ఆరోపణలకు మద్దతుగా ఏడు రోజుల్లోగా రాహుల్‌గాంధీ అఫిడవిట్ దాఖలు చేయడమో లేదా క్షమాపణ చెప్పడమో చేయాలని సీఈసీ జ్ఞానేష్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆ ఆరోపణలను నిరాధారమైనవిగా భావించి రాహుల్ గాంధీపై తదుపరి చర్యలు చేపడతామని హెచ్చరించారు. ఈ ప్రతిస్పందన పారదర్శకతను, చర్చలను ప్రోత్సహించే బదులు ఒక ప్రతికూల వాతావరణాన్ని సృష్టించింది. విమర్శలకు అతీతమైన సంస్థగా కాకుండా దాడికి గురైన ఒక ప్రభుత్వ శాఖ మాదిరిగా ఎన్నికల సంఘం ప్రవర్తించింది. ఇది ఆ సంస్థపై వచ్చిన ఆరోపణల కంటే ఎక్కువగా దానిపై ప్రజల్లో ఉన్న నమ్మకాన్ని దెబ్బతీస్తుంది. ఈ బహిరంగ ఘర్షణ ఎన్నికల వ్యవస్థ పునాదులనే ప్రశ్నించే స్థాయికి చేరింది. ఈ ఆరోపణల వెనుక ఉన్న అసలు సమస్య ఓటర్ల జాబితాల నిర్వహణలో ఉన్న తీవ్రమైన వ్యవస్థాగత లోపాలు. బీహార్‌లో చేపట్టిన ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) డ్రైవ్ దీనికి ఒక ఉదాహరణ. ఈ డ్రైవ్‌లో సుమారు 65 లక్షల ఓటర్ల పేర్లను తొలగించారు. ఎన్నికల సంఘం దీన్ని జాబితా శుద్ధీకరణగా చెబుతున్నప్పటికీ ఇంత పెద్ద సంఖ్యలో తొలగించడం, ఆ వివరాలు గుట్టుగా ఉంచడం అనుమానాలకు దారితీశాయి. చివరికి సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని తొలగించిన ప్రతి పేరుకు కారణంతో సహా పూర్తి వివరాలు తమ ముందు ఉంచాలని ఆదేశించాల్సి వచ్చింది. పాట్నాలో బూత్ స్థాయి అధికారుల (బీఎల్‌వోస్) పనితీరుపై జరిగిన పరిశీలనలు కూడా ఈ అనుమానాలను పెంచాయి. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల(ఈవీఎం)పై కొనసాగుతున్న వివాదం వీటిని మరింత బలపరుస్తోంది. ఈవీఎంలను ట్యాంపర్ చేయడం అసాధ్యమని నిపుణులు చెబుతున్నా ప్రజల సందేహాలను నివృత్తి చేయడంలో ఎన్నికల సంఘం విఫలమైంది. పారదర్శకత కోసం ప్రవేశపెట్టిన ఓటరు-ధ్రువీకరించిన పేపర్ ఆడిట్ ట్రయల్ (వీవీ ప్యాట్) వ్యవస్థ కూడా వివాదాన్ని పరిష్కరించలేదు. ఇప్పుడు వీవీ ప్యాట్ స్లిప్పులను ఎంత మేరకు లెక్కించాలనే దానిపై కొత్త చర్చ మొదలైంది. కేవలం ఒక చిన్న నమూనాను మాత్రమే లెక్కించడానికి ఎన్నికల సంఘం పరిమితం కావడం మరిన్ని అనుమానాలకు తావిస్తోంది. ఈవీఎంలను సమర్థిస్తున్నవారు కూడా ప్రజల నమ్మకాన్ని నిలబెట్టడానికి వీవీప్యాట్ లెక్కింపు పరిమాణాన్ని పెంచాలని సూచిస్తున్నారు. ఓడిపోయిన పార్టీలు ఎన్నికల ప్రక్రియను ప్రశ్నించడం, గెలిచిన పార్టీలు సమర్థించడం ఒక ఆనవాయితీగా మారింది. తన పట్ల విశ్వసనీయత తగ్గిపోవడానికి ఎన్నికల సంఘం కూడా కొంతవరకు కారణం. ఓటర్ల సమాచార పరిశీలనను కష్టతరం చేయడం, తుది పోలింగ్ శాతాల వెల్లడిలో జాప్యం, విమర్శలను తనపై దాడులుగా పరిగణిస్తూ ఆత్మరక్షణ ధోరణి ప్రదర్శించడం వంటివి ఎన్నికల సంఘం నిబద్ధతపై నీలినీడలు కమ్ముకునేలా చేస్తున్నాయి. వీటన్నింటికీ మూల కారణం ఎన్నికల కమిషనర్ల నియామక ప్రక్రియలో ఉంది. స్వతంత్ర వ్యవస్థ అయిన ఎన్నికల సంఘాన్ని నడిపించే కమిషనర్ల నియామక ప్రక్రియ పూర్తిగా ప్రభుత్వ నియంత్రణలో ఉండటం ప్రాథమిక స్థాయిలోనే సంస్థ నిష్పాక్షికత, స్వతంత్రతపై అనుమానాలు రేపుతోంది. ఇవి పోవాలంటే సమగ్ర సంస్కరణలు అవసరం.

# తెలంగాణ న్యాయంలో మానవతా విలువల ప్రతిబింబం

మాడభూషి శ్రీధర్

మాజీ సుప్రీంకోర్టు న్యాయమూర్తి బి.సుదర్శన్‌రెడ్డిని భారత ఉప రాష్ట్రపతి పదవికి ఇండియా ప్రతిపక్ష కూటమి అభ్యర్థిగా ప్రకటించడం మంచి ఆలోచన. అన్ని కోణాల నుంచి పరిశీలించినా, పూర్తిగా అర్హుడైన వ్యక్తి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి. రాజ్యాంగ పరమైన రూల్ ఆఫ్ లా దేశం కోసం తహతహపడిన న్యాయమూర్తి. భారత రాజ్యాంగ వ్యవస్థలో న్యాయ శాఖ కీలక స్థంభాలలో ఒకటి. ఈ వ్యవస్థలో కొంతమంది న్యాయమూర్తులు వారి అఖండ న్యాయబద్ధత, విలక్షణ దృష్టి, ప్రజాస్వామ్య విలువలపై విశ్వాసంతో చరిత్రలో నిలిచిపోయారు.

## న్యాయవిద్యా ప్రస్థానం

బి.సుదర్శన్‌రెడ్డి 1948లో జన్మించారు. హైదరాబాదులో న్యాయ విద్యను అభ్యసించి ఉస్మానియా న్యాయ కళాశాల నుండి లా డిగ్రీ పొందారు. తన విద్యా దశ నుండే న్యాయ వ్యవస్థపై అభిమానం, రాజ్యాంగ విలువలపై అవగాహన, సామాజిక న్యాయంపై నిబద్ధత బలంగా ఉన్న వ్యక్తి. 1971లో న్యాయవాదిగా రాజ్యాంగ అంశాలపైన వాదనలు చేస్తూ హైకోర్టు సుప్రీంకోర్టుల్లో ప్రజాహక్కుల కేసులు, రాజ్యాంగ సంబంధిత విషయాలపై ధైర్యవంతమైన వాదనలు గుర్తింపు పొందాయి. 1995లో సుదర్శన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. ఆ తర్వాత 2007లో జస్టిస్ సుదర్శన్‌రెడ్డి భారత సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆయన తీర్పుల్లో రాజ్యాంగం పట్ల గౌరవం, ప్రజల హక్కుల పరిరక్షణ, పారదర్శక పాలనపై నిబద్ధత స్పష్టంగా కనిపిస్తుంది. కొన్నేళ్ల పాటు నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్‌గా కూడా పనిచేశారు, సామాన్య ప్రజలకు న్యాయం అందించాలన్న లక్ష్యం ఆయన ఎన్నో కార్యక్రమాలు చేపట్టారు.

అన్నింటికన్నా ముఖ్యమైంది న్యాయ వ్యవస్థను రాజకీయ ప్రభావాలనుంచి దూరంగా ఉంచాలన్న నిర్ణయం, అందుకు కృషి చేయడం ఆయన గొప్పతనం. న్యాయబద్ధతకు నిదర్శనంగా నిలిచిన ఆయన తీర్పులు నేటికీ న్యాయవాదులకు మార్గదర్శిగా నిలుస్తున్నాయి. జాతీయ ప్రాముఖ్యత కలిగిన కేసుల్లో ఆయన తీర్పులు సమాజాన్ని ప్రభావితం చేశాయి. ఉప రాష్ట్రపతి అభ్యర్థిత్వం ఇండియా కూటమి ఎంపిక సమకాలీన రాజకీయాల మధ్య నైతికత, ప్రజాస్వామిక విలువల పరిరక్షణకు చిహ్నంగా బి.సుదర్శన్‌రెడ్డిని ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ఎంపిక చేయడం విశేషం. ఈ నిర్ణయం న్యాయతంత్రానికి గౌరవం, రాజ్యాంగ పదవులపై ఉన్న గంభీరతకు ప్రతిబింబం.

సుదర్శన్ రెడ్డి ప్రజాస్వామ్యం పట్ల నిబద్ధత ఉన్న నేతగా కూడా ప్రశంసించదగిన వ్యక్తి. ఉప రాష్ట్రపతి పదవిలో ఆయన ఉండటం భారత రాజ్యాంగానికి, నైతిక విలువలకు మేలు చేసే అవకాశం. తన జీవితాన్ని న్యాయబద్ధతకు అంకితం చేసిన ఆయనకు ఈ పదవి సముచిత గౌరవం అవుతుంది. ముఖ్యంగా జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి సల్వా జుడుం కేసులో ఇచ్చిన తీర్పు భారత న్యాయచరిత్రలో ఒక చారిత్రాత్మక మైలురాయిగా నిలిచిందని చర్చించుకోవలసిందే. ఈ తీర్పు ప్రజల మౌలిక హక్కుల పరిరక్షణ, రాజ్యాంగ విలువల ప్రతిష్ఠాపనలో గొప్ప ప్రాధాన్యతను సంతరించుకుంది.

## సల్వా జుడుం కేసు

నందిని సుందర్ & అదర్స్ వర్సెస్ స్టేట్ ఆఫ్ చత్తీస్‌గఢ్ పేరుతో 2011 జులై 5న చరిత్రాత్మకమైన ఎంతో గణనీయమైన తీర్పునిచ్చారు. అదొకటే ఒక పుస్తకంగా రావలసిన తీర్పు. (ఈ ఇంగ్లీషుతీర్పుపై అనువదించే అవకాశం ఈ రచయితకు లభించింది. మలుపు పబ్లికేషన్స్ ప్రచురించింది) జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి జస్టిస్ ఎస్.ఎస్. నాజీర్ ధర్మాసనం ద్వారా సుదర్శన్ రెడ్డి రచించిన ఈ తీర్పులో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ప్రభుత్వం 'సల్వా జుడుం' అనే పేరుతో గిరిజనులను ఆయుధదారులుగా నియమించి మావోయిస్టులపై పోరాటానికి ఉపయోగించడం గురించి ఘాటైన తీర్పు ప్రకటించారు. తప్పకుండా చర్చించవలసిన ప్రధానమైన అంశాలు ఇవి:

**1. సల్వా జుడుం అక్రమమని నిర్ణయం:** ప్రభుత్వమంతట కూడా తన పౌరులైన గిరిజనులను ఆయుధదారులుగా మావోయిస్టులపై పోరాటానికి నియమించడం రాజ్యాంగ విరుద్ధమని కోర్టు తేల్చింది.

**2. దారుణమైన అస్త్రాలతో పౌరుల నియామకం అనైతికం:** ఎస్‌పీవోస్ (స్పెషల్ పోలీస్ ఆఫీసర్స్)గా గ్రామస్తులను నియమించడం అనైతికమనీ, వారికి తగిన శిక్షణ లేకుండా ఆయుధాలు ఇచ్చి పోరాటానికి పంపడం చాలా ప్రమాదకరమనీ అని కూడా ఈ ధర్మాసనం వివరించింది.

**3. మౌలిక హక్కుల ఉల్లంఘన చెల్లదు:** ఈ విధానం ఆర్టికల్ 14 (సమానత్వ హక్కు) ఆర్టికల్ 21 (జీవిత హక్కు)కు విరుద్ధమని తీర్పు చెప్పింది.

**4. సల్వా జుడుం రద్దు చేయాల్సిందే:** సల్వా జుడుం చర్యలను తక్షణమే నిలిపివేయాలని, ఆయుధాలు ఇచ్చిన గ్రామస్తుల్ని ఉపసంహరించుకోవాలని కోర్టు స్పష్టంగా పేర్కొంది.

**5. పౌరుల భద్రత ప్రభుత్వ బాధ్యత:** ప్రభుత్వం సురక్షిత, న్యాయపరమైన మార్గాల్లో మావోయిస్టు సమస్యను పరిష్కరించాలి కానీ పౌరులను ఆయుధంగా మార్చకూడదని కోర్టు గట్టిగా హెచ్చరించింది.

ఈ తీర్పు ద్వారా జస్టిస్ సుదర్శన్ రెడ్డి ప్రభుత్వానికి ప్రజల హక్కుల పరిరక్షణపై స్పష్టమైన సందేశం ఇచ్చారు. న్యాయం, మానవహక్కులు, రాజ్యాంగ ప్రమాణాలను కాపాడటంలో ఇది గొప్ప ముందడుగు. ఈ తీర్పు భారత న్యాయవ్యవస్థలో 'జ్యుడిషియల్ హ్యూమానిజం'కి గొప్ప ఉదాహరణగా నిలిచింది. రాజ్యాంగ పీఠికపై ప్రసంగం ఈ మధ్య భారత రాజ్యాంగ పీఠిక పుస్తకంలో న్యాయమూర్తి బి.సుదర్శన్ రెడ్డి ప్రసంగిస్తూ మన రాజ్యాంగం మనది కాదని వాదించే పెద్దల గురించి విమర్శించారు. 'ఇది పాశ్చాత్య రాజ్యాంగం మాకెందుకు, ఏం సంబంధం అంటే, ఆ వాదన కాన్‌స్టింట్యుయెంట్ అసెంబ్లీ కానిస్టిట్యూషన్ ముసాయిదా చేసిన రోజే ఆర్గనైజర్ ఫ్రంట్ పేజీలో ఎడిటోరియం త్రివర్ణ పతాకాన్ని మేము గుర్తించబోము, రాజ్యాంగాన్ని గుర్తించడమే చేయము, మేము దానిని పాటించబోము అని ప్రకటించారు. ఇప్పుడు ఒక మేధావి వర్గానికి చెందినవాళ్లు చెప్పిన మాటలు పేర్కొంటూ, దానికి అంబేద్కర్ జవాబు ఇస్తూ 'భారత రాజ్యాంగం ఇతర రాజ్యాంగాన్ని అన్నిటిని కూడగట్టి రూపొందించిందిగా వర్ణిస్తే నేను గర్వపడను ఎందుకనగా మంచి ఎక్కడున్నా గ్రహించడం తప్పేమీ కాదు' అని న్యాయమూర్తి సుదర్శన్ రెడ్డి నిర్ద్వంద్వంగా ప్రకటించారు.

**రాజ్యాంగ తీర్మానం:** నెహ్రూ రాజ్యాంగానికి నిర్మాణానికి ముందు పీఠిక వంటి రిజల్యూషన్‌లో నెహ్రు రాసింది వేరు. రాజ్యాలకు (స్టేట్స్) ఎక్కువ నిర్ణయించారు. ఆ అధికారాలలో మిగిలింది రాజ్యాలకే (స్టేట్స్‌కే) ఉండాలి యూనియన్‌కు అవసరమైన కొన్ని అధికారాలు మాత్రమే ఉండాలి. అందు కొరకు నెహ్రూ యూనియన్ ఆఫ్ స్టేట్స్ అనేది ఆయన ఆలోచన. అదీ ఆబ్జెక్ట్స్ రిజల్యూషన్ అది ఎప్పుడు ప్రవేశించింది. 31 ఏప్రిల్ 1946, అంటే విభజన ప్లాన్ ముందు అని అర్థం చేసుకోవాలదని సుదర్శన్‌రెడ్డి వివరించారు.

'నెహ్రు ఏమన్నాడు? అక్కడెక్కడో చదువుకున్నాడు అని ఎవరంటున్నారు? అసలు 1947 స్వాతంత్ర్యం కన్నా ముందు ఆయనకు అసలు ఈ దేశం సంగతి తెలియదనుకుంటారా? అంటే డిస్కవరీ ఆఫ్ ఇండియా చూసుకున్నాడో తెలుసుకోవాలి. చదువుకున్నామని నటించే వాళ్లు నెహ్రూకు ఈ దోషం అంటగడతారా? డిస్కవరీ ఆఫ్ ఇండియాలో ఉపనిషత్తుల చర్చ, హిమాలయ పర్వతాల చర్చ, గంగానది చర్చ, ఆర్యుల చర్చ, మెహంజాదారో సత్యం అంటే ఈ పదం రాలేదా' అన్నారు. గాంధీజీ ఏమన్నారు అంటే, 'నా కిటికీలు అన్ని తెరిచి చూస్తాను స్వచ్ఛమైన గాలి ఆలోచనలు ఎక్కడి నుంచి వచ్చినా స్వీకరిస్తాను' అంటూ ఆ గాంధీ అంబేద్కర్ మధ్యన లేని వైరుధ్యాలను సృష్టించి వాళ్లకు వాళ్లే సంతోషపడేన్నారని విమర్శించారు. అని సుదర్శన్ రెడ్డి వివరించారు.




# లగ్జరీపై నాకంత ఆసక్తి లేదు

ఈ మధ్య ఓ వర్ధమాన నటుడు తాను తొందరపడి ఓ ఖరీదైన కారు కొని తర్వాత అవకాశాలు తగ్గటంతో ఆ భారీ ఈఎంఐలు కట్టలేక ఎలా ఇబ్బంది పడుతున్నాడో పక్కనున్న నటుడితో చెబుతున్నప్పుడు నాకో సంఘటన గుర్తొచ్చింది.

మా గురువుగారు (కోడిరామకృష్ణ గారు) దాదాపు 50 సినిమాలకు దర్శకత్వం వహించాక కూడా మారుతి ప్రీమియర్ కారులాంటివి తప్ప భారీగా ఖరీదైన కారు కొనలేదు. ప్రొడక్షన్‌వారి అంబాసిడర్ కారులోనే షూటింగ్‌కి వచ్చేవారు. ఓ రోజు ఓ పెద్దాయన గురువుగారితో 'సార్ నిన్నమొన్న ఒకటీ రెండు సినిమాలు హిట్లిచ్చిన డైరెక్టర్సే పెద్దపెద్ద కార్లు కొని ఎంజాయ్ చేస్తుంటే ఇన్ని సూపర్‌హిట్లిచ్చిన మీరేంటి సార్ ఇంకా లగ్జరీ కారు కొనకుండా' అన్నారు. దానికి గురువుగారు 'లగ్జరీ కారుదేముంది సార్ ఒకటి కాకపోతే రెండు కొనగలం. కానీ మన జీవితానికి మనం అలవాటు చేసే ఏ లగ్జరీ అయినా సరే ఈ క్షణం నుండి మనకు ఒక్క రూపాయి కూడా రాకుండా సంపాదన ఆగిపోయినా జీవితాంతం దానిని సాఫీగా కొనసాగించగలగాలి. పైగా మన పిల్లలు కూడా ఆ లగ్జరీకి అలవాటుపడతారు. ఎప్పుడైనా ఆ స్థాయి కంటే కిందికి దిగాల్సిన పరిస్థితి వస్తే వాళ్లూ బాధపడాల్సిందే. నిజానికి అంతటి ఆర్థిక స్థాయి ఉండి అనుభవించాలనే కోరికలున్నప్పుడు తప్పులేదు. కానీ వాటిపైన నాకంతటి ఆసక్తి కూడా లేదు. అయినా పైకెగిరేవాడు కిందపడతాడు గానీ, నేల మీద నడిచేవాడు పడడుకదండీ. నాకు నేలపైన నడవడమే ఇష్టం' అన్నారు. డబ్బు విషయంలో విజేతల పొదుపరితనాన్ని చూసి పిసినారితనం అనుకుంటారు సామాన్యులు. నిజంగా ఆర్థికంగా బలపడేవాళ్లు తమ అవసరాల కోసం తప్ప జనం ముందు గొప్పను ప్రదర్శించటం కోసం డబ్బును ఖర్చు చేయరు. 'నిజమైన ధనవంతుడు పేదవాడిలా కనిపించినా ఐశ్వర్యవంతుడవుతూనే వుంటాడు. ధనవంతుడిలా కనిపించాలనుకునే పేదవాడు మాత్రం మరింత పేదవాడు అవుతాడు' అనే సూక్తి నిరూపితమైన నిజం. నిజమైన ప్రతిభకి మనుషులిచ్చే విలువకంటే ఆడంబరాన్ని చూసి ఇచ్చే విలువ ఎక్కువగా కనిపించినా దానికి ఆయుష్షు తక్కువే.

ఉన్నది ఒకటే జీవితం.. అనుభవించాలి గానీ పోయేటప్పుడు ఏమి తీసికెళ్తాం? అనేది ఒకరి ఫిలాసఫీ అయితే, వెళ్లేముందు ఉన్నవాళ్ళకి ఏమి వదిలి వెళ్లగలం? అనేది మరొకరి ఫిలాసఫీ. జిహ్వాకో రుచి అన్నట్లు ఎవరి జీవితానుభవాలను బట్టి వారి వారి ప్రత్యేక ఫిలాసఫీ రూపొందుతుంది. ఎవరికి వారిది కరెక్టే.

- దేవీప్రసాద్





సినిమా చూస్తున్నంత సేపు ఈ క్యారెక్టర్‌లో ఉండే వేరియేషన్స్‌కి ప్రేక్షకుల్లో ఆమె పట్ల చిర్రెత్తుకొచ్చి.. కనిపిస్తే కొట్టాలన్న కోపం తెప్పించేస్తుందంటున్నారు. అంతేనా, చివర్లో నాగార్జున ఆమెను చంపేస్తుంటే.. ఇంకా ఇంకా అన్నట్టుగా మనసులోని రాక్షసత్వాన్ని బయటకు ప్రదర్శిస్తున్నారు కొందరు ప్రేక్షకులు. అంతలా.. ఆ క్యారెక్టర్‌లో నటించింది రచితా రామ్.

# ఈ లేడీ విలన్.. అగ్రహీరోల పాత్రలను బీట్ చేసింది

**ఎనభై, తొంభైల్లో తెలుగు సినిమా విలన్ల పాత్ర చాలా కీలకంగా ఉండేది. ఎంతంటే. ఆ పాత్రలో జీవించిన నటులు బయట కనిపిస్తే.. యమ తిట్లు తిట్టేవారు అప్పటి జనం. ఎందుకంటే, ఆ పాత్రలో అలా జీవించేవారు మరి. అలాంటి నటులు కనుమరుగైపోతున్నారని అనుకుంటున్న వేళ.. కూలీ సినిమాలో ఓ లేడి క్యారెక్టర్ మొత్తం టాప్ హీరోలను కూడా డ్యామినేట్ చేసేసింది. సగటు ప్రేక్షకుడు ఆమెను చూస్తున్నంత సేపు.. నాయల్ది, కత్తందుకో జానకీ.. అన్నంత కోపంతో సినిమా చూస్తున్నాడు. ఆ క్యారెక్టర్‌లో అంతలా జీవించింది రచితా రామ్.**

కూలీ సినిమాలో బాలీవుడ్ సహా కన్నడ, తెలుగు, తమిళ, మళయాళం ఇండస్ట్రీల నుండి పేరొందిన అగ్రహీరోలు నటించారు. కానీ అందులో విలన్ పాత్ర పోషించిన నాగార్జున, అమీర్ ఖాన్, షౌబిన్ కంటే కూడా.. రచితా రామ్ నటించిన కళ్యాణి క్యారెక్టర్ ప్రేక్షకులను ఆకట్టుకుందనేది కొందరి నుంచి వినిపిస్తున్న బలమైన టాక్. అందుకే సినిమా రిలీజైన తర్వాత సోషల్ మీడియాలో ఆమె పాత్ర గురించి విస్తృతమైన చర్చ జరుగుతోంది. ముఖ్యంగా ఆమె పాత్ర చుట్టూ ఉన్న ట్విస్ట్.. ఆమె నటనా ప్రేక్షకులను కట్టేపడేసింది.

80, 90ల నాటి తెలుగు సినిమాల్లో విలన్లుగా నటించిన చలపతిరావు, కోట, ఆ తర్వాత తనికెళ్ల భరణి లాంటి వాళ్లను బయట చూసినప్పుడు జనం కోపంగా ఉద్రేకంగా చూసేవారట. ఆ సినిమాలో హీరోయిన్‌ను అంతలా ఏడిపించాలా.. హీరోనే చంపేంత ధైర్యామారా అంటూ ప్రశ్నలు ఎదుర్కొన్నామంటూ ఆ పాత విలన్లు ఎన్నోసార్లు చెప్పిన ఘటనలూ ఉన్నాయి. అదిగో అలాంటి సందర్భమే.. ఇప్పుడు ఈ కన్నడ భామ రచితా రామ్ ఎదుర్కొంటుందట. సినిమా చూస్తున్నంత సేపు ఈ క్యారెక్టర్‌లో ఉండే వేరియేషన్స్‌కి ప్రేక్షకుల్లో ఆమె పట్ల చిర్రెత్తుకొచ్చి.. కనిపిస్తే కొట్టాలన్న కోపం తెప్పించేస్తుందంటున్నారు. అంతేనా, చివర్లో నాగార్జున ఆమెను చంపేస్తుంటే.. ఇంకా ఇంకా అన్నట్టుగా మనసులోని రాక్షసత్వాన్ని బయటకు ప్రదర్శిస్తున్నారు కొందరు ప్రేక్షకులు. అంతలా.. ఆ క్యారెక్టర్‌లో నటించింది రచితా రామ్. అసలు ఈ సినిమాలో అమాయకత్వంతో సహా రూత్‌లెస్ విలనిజం చూపించిన క్యారెక్టర్ ఏదైనా ఉంది అంటే.. అది కేవలం రచితా రామ్ నటించిన కళ్యాణి పాత్ర మాత్రమే. అందుకే అగ్రహీరోలు విలన్లుగా నటించినా.. సగటు ప్రేక్షకుడి మదిలో మాత్రం ఈ కన్నడ భామ మాత్రమే గుర్తుండిపోయింది.. సోషల్ మీడియా అంతటా చర్చగా మారింది. అన్నట్టు.. ఈ లేడి విలన్ 2013లో తన కెరీర్ మొదలు పెట్టింది. ఇన్నేళ్లు కన్నడ నాట సినిమాలు చేసింది. ఇప్పుడు కూలీ సినిమాతో అన్ని ప్రాంతాల్లోనూ చర్చగా మారింది.

బాతాఖానీ సౌజన్యంతో..

# శుభం పలకరా పెళ్లికొడకా.. అంటే!



**Are Prenuptial Agreements the Future of Marriage in India?**

As societal norms evolve and divorce rates climb, the concept of prenuptial agreements (prenups) is becoming increasingly relevant for India. Traditionally viewed as a Western import, prenups offer couples a way to outline financial responsibilities, asset distribution, and child custody arrangements before tying the knot. In a rapidly changing world, it's time to explore whether India is ready to embrace this trend.

**Why Prenuptial Agreements Matter**

Prenuptial agreements serve a vital purpose: they help mitigate potential disputes over wealth and assets.




- **శుభం పలకరా పెళ్ళికొడకా! అంటే ఆ పెళ్లికొడుకు అనకూడని మాట అనడంతో జరగకూడని అనర్థం జరిగిందని అనాదిగా సామెత చెబుతూనే ఉంది. భారతదేశంలో అత్యంత సంపన్నుల ఇళ్ళల్లో పెళ్లి నిశ్చయమైనప్పుడే.. ఒకవేళ విడాకులు తీసుకుంటే పంపకాలకు సంబంధించి కూడా ఒక మాట అనుకుని.. ఆ ఒప్పందాన్ని రిజిస్టర్ చేయిస్తున్నారు.**
- **పెద్ద పెద్ద వ్యాపార సామ్రాజ్యాలున్న కుటుంబాల్లో సంసారం సజావుగా సాగితే పరవాలేదు కానీ.. మనస్పర్థలొచ్చి భార్యాభర్తలు విడిపోతే కంపెనీ ఆస్తులను కూడా విభజించాల్సి వస్తోంది. దాంతో దశాబ్దాల కంపెనీలు రోడ్డున పడుతున్నాయి. బ్రాండ్ విలువ పోతోంది. పెట్టుబడిదారుల్లో నమ్మకం పోతోంది. చివరకు కంపెనీ మనుగడే ప్రశ్నార్థకమవుతోంది.**



**సంపన్న పారిశ్రామికవేత్తలు నిశ్చితార్థమప్పుడే శుభ ప్లస్ అశుభం కలిపి సవర్ణదీర్ఘసంధిగా శుభాశుభాలు రెండూ ఓపెన్‌గా, స్పష్టంగా మాట్లాడుకుంటున్నారు. ఈ పెళ్లి పెటాకులైతే భరణంగా నీకు దక్కేది ఇంతే అని కాగితం మీద లెక్కలు రాసి చూపిస్తున్నారు. అంతకుమించి అడగను అని అమ్మాయి/అబ్బాయి చేత ముందే ఒప్పంద పత్రాల మీద సంతకాలు చేయించుకుని వాటిని స్థానిక రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్టర్ కూడా చేయిస్తున్నారు.** (ఇంట్లో, కంపెనీ బోర్డు మీటింగుల్లో బోర్డులుగా కూడా పటం కట్టి వేలాడదీస్తున్నారేమో!) ఈ పెళ్లి జరిగి.. పిల్లలు పుట్టి.. విడిపోతే.. పిల్లల పోషణ, వారికి ఆస్తిలో వాటాల లెక్కలు కూడా నిశ్చితార్థం రౌండ్‌టేబుల్ మీదే సుహృద్భావ వాతావరణంలో ఇరుపక్షాలవారు నీళ్లు నమలకుండా మాట్లాడుకుని.. అగ్రిమెంట్లు రాసుకుంటున్నారు. విడిపోతే సొంత ఆస్తుల్లో తప్ప కంపెనీల ఆస్తుల్లో వాటా అడగను అని మరికొంతమంది ఉదారంగా వ్యవహరిస్తున్నారు. ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్లలా ఆఫ్టర్ డైవోర్స్ సెటిల్మెంట్ అడ్వైజర్ల కొత్త వృత్తి పుట్టుకొచ్చింది. చేతులు కాలాక విడాకులు పట్టుకుని ప్రయోజనం లేదన్న ఎరుకతో.. చేయి చేయి కలవకముందే, కొంగూ కొంగూ ముడివేయక ముందే, అగ్నిసాక్షిగా ఏడడుగులు నడవకముందే, సంసారంలో అగ్గి రాజుకుని, ఒక్కడుగు కూడా కలిసి నడవలేని సందర్భాన్ని ముందే అంచనా వేసి అన్ని ఏర్పాట్లు, రాతకోతలు చేసుకుంటున్నారు.

సంపన్నులు, పారిశ్రామికవేత్తల కుటుంబాల్లోనే కాదు. మొత్తం భారతీయ సమాజంలోనే విడాకుల సంఖ్య విపరీతంగా పెరిగింది. ఇంకా పెరుగుతుంది. దానికి కారణాల చర్చ ఇక్కడ అనవసరం.

మనసులు కలవనప్పుడు విడిపోతేనే నయమన్న వాదనకు అంగీకారం, ఆమోదం దొరుకుతోంది. విడిపోతే ఏమిటి? ఎలా? అన్నవి నిశ్చితార్థమప్పుడే మాట్లాడుకోవడం కూడా ఒక ఆచారంగా, లీగల్ ప్రొసీజర్‌గా మారిన రోజుల్లో ఉన్నాం! బ్రేకప్ పార్టీలు ధూమ్ ధామ్ సెలెబ్రేషన్స్‌గా జరుగుతున్నప్పుడు ఎంగేజ్మెంట్ వేళ పెళ్లి పెటాకులైతే అన్న ముందు జాగ్రత్తతో చేసుకునే విడాకుల ఒప్పందాల కార్యక్రమాన్ని కూడా ధూమ్ ధామ్‌గా, అధికారికంగా, లీగల్‌గా, శాస్త్రీయంగా నిర్వహించుకోవడాన్ని ఎలా తప్పుపట్టగలం?

ఒక పెద్ద పారిశ్రామికవేత్తకు భారత ఆదాయపు పన్ను శాఖవారి లెక్కల ప్రకారం అయిదున్నరవేల కోట్ల సంపద ఉంది. మొదట ఒక పెళ్లయ్యింది. కొంతకాలం కాపురం చేశాక మనస్పర్థలొచ్చాయి. పరస్పర అంగీకారంతో గౌరవంగా, మర్యాదగా, ప్రశాంతంగా కోర్టుద్వారా లీగల్‌గా విడిపోయారు. ఆ సందర్భంగా భరణంగా మాజీ భార్యకు మాజీ భర్త 500 కోట్లు మనస్ఫూర్తిగా ఇచ్చాడు. కొంతకాలం గడిచింది. ఇంత సంపద ఉన్నా ఏదో వెలితి అని.. మళ్లీ పెళ్లి చేసుకున్నాడు. ఆయన కర్మ ఎందుకో బలంగా కాలి.. రెండో పెళ్లిలో వేసిన మూడు ముళ్లు కూడా గట్టిగా నిలబడక వదులుగా జారిపోయాయి. పూర్వానుభవం ఎలాగూ ఉంది కాబట్టి.. అలాగే పరస్పర అంగీకారంతో గౌరవంగా, మర్యాదగా, ప్రశాంతంగా కోర్టు ద్వారా లీగల్‌గా విడిపోదాం అన్నాడు.

ఆమె అడ్డం తిరిగింది. మొదటామె అమాయకురాలు కాబట్టి నీ 5,500 కోట్లలో 500 కోట్లు భరణంగా ఇస్తే సరేనని మౌనంగా తల వంచుకుని విడాకుల కాగితాల మీద సంతకాలు పెట్టింది.. నేనలా కాదు.. అర్ధాంగిగా నాకు నీ ఆస్తిలో అర్ధభాగం అంటే 2,750కోట్లు ఇస్తేనే సంతకం పెడతాను అని పేచీ పెట్టింది. స్థానిక కోర్టు, హైకోర్టు దాటి కేసు సుప్రీం కోర్టు దాకా తెగ తీగసాగింది.

ఈ కేసు విన్న న్యాయమూర్తులకు చిర్రెత్తుకొచ్చింది. ఈమధ్య చాలామంది మహిళలు భరణంగా ఇలాగే సగం లెక్కలు వేసి అడుగుతున్న విషయం గుర్తొచ్చింది. ప్రత్యేకించి ఈ కేసులో మొదటామెకు ఇచ్చినట్లు 500 కోట్లు అడిగినా బహుశా న్యాయమూర్తులు ఇంత ఇదయి ఉండేవారు కాదేమో! 2,750కోట్ల భరణమా! ఏం వేళాకోళంగా ఉందా? వేల కోట్లకు ఎన్ని సున్నాలుంటాయో తెలుసా? అడగడానికయినా ఒక హద్దుండద్దా! అని క్లాసు తీసుకున్నారు.

విడిపోయిన తర్వాత తన మానాన తను గౌరవంగా, ఆర్థికంగా ఇబ్బందిపడకుండా సహేతుకమైన జీవనప్రమాణంతో బతకడానికి ఇచ్చేదే భరణం కానీ.. మాజీ జీవిత భాగస్వామితో సమానంగా ఆర్థిక స్థితి కల్పించడం కాదని సర్వోన్నత న్యాయమూర్తులు కుండ బద్దలుకొట్టినట్లు స్పష్టంగా చెప్పారు. ఆమెకు భరణంగా 12 కోట్లు చెల్లిస్తే సరిపోతుందని తీర్పునిస్తూ.. అతడిపై ఆమె పెట్టిన అన్ని క్రిమినల్ కేసులను కూడా కొట్టేశారు.

(ఆమె కోర్టుకెక్కకపోయి ఉంటే 500 కోట్లు వచ్చేవేమో పెరుమాళ్లకే ఎరుక!)

ఇలాంటి కేసులన్నీ వినీ వినీ..

## పెళ్లి కమర్షియల్ వెంచర్ కాదు

- భరణం సహేతుకంగా ఉండాలి: సుప్రీం
- చట్టాలను దుర్వినియోగం చేయొద్దు



న్యూఢిల్లీ: మహిళల సంక్షేమం కోసం రూపొందించిన చట్టాలను భర్తలపై వేధింపులకు, దోపిడీకి సాధనాలుగా దుర్వినియోగం చేయరాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ''భరణం మహిళకు సహేతుకమైన జీవన ప్రమాణాలను అందించడానికి ఉద్దేశించింది. అంతే తప్ప మాజీ జీవిత భాగస్వామితో సమానమైన ఆర్థిక స్థితిని కల్పించడానికి కాదు'' అని జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ పంకజ్ మిత్తల్‌తో కూడిన ధర్మాసనం నొక్కి చెప్పింది. ఒక మహిళ దాఖలు చేసుకున్న విడాకుల కేసు విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. తన భర్తకు రూ.5,000 కోట్ల నికర ఆస్తులున్నాయని, మొదటి భార్యకు ఏకంగా రూ.500 కోట్ల భరణం చెల్లించాడని ఆమె పేర్కొంది. తనకూ భారీగా భరణం ఇప్పించాలని కోరింది. దీనిపై ధర్మాసనం తీవ్ర అభ్యంతరం వెలిబుచ్చింది. ''మాజీ భార్యకు తన ప్రస్తుత ఆర్థిక స్థితి ఆధారంగా నిరవధికంగా మద్దతివ్వాల్సిన అవసరం పురుషునికి లేదు. వివాహం కుటుంబానికి పునాది మాత్రమే తప్ప కమర్షియల్ వెంచర్ కాదు. మహిళలు తమ మేలు కోసం కోరే చట్టాలను జాగ్రత్తగా ఉపయోగించాలి'' అని సూచించింది. వివాహాన్ని రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. పిటిషనర్‌కు శాశ్వత భరణం కింద నెల రోజుల్లో రూ.12 కోట్లు చెల్లించాలని మాజీ భర్తకు ఆదేశించింది. అతనిపై దాఖలు చేసిన క్రిమినల్ కేసులను కొట్టేసింది. ''విడాకుల కేసుల్లో భార్యలు తమ జీవిత భాగస్వామి ఆస్తులు, హోదా, ఆదాయాలను హైలైట్ చేయడం, వాటిలో సమాన వాటా కోరడం బాగా పెరుగుతోంది. ఇది సమర్థనీయం కాదు. భరణం విషయంలో భర్త ఆదాయాన్ని మాత్రమే కాకుండా, భార్య ఆదాయం, అవసరాలు తదితర అంశాలెన్నింటినో పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. ఒకవేళ విడాకుల తర్వాత దురదృష్టం కొద్దీ భర్త నిరుపేదగా మారితే? అప్పుడు తామిద్దరి సంపదను సమానం చేసుకోవడానికి సిద్ధపడుతుందా?'' అని ప్రశ్నించింది. భార్య, ఆమె కుటుంబ సభ్యులు క్రిమినల్ చట్టాలను బేరసారాల సాధనంగా దుర్వినియోగం చేయరాదని హెచ్చరించింది.

Courtesy: Sakshi

**పమిడికాల్వ మధుసూదన్**

---

## రిమ్స్ సెక్యూరిటీ వేతన బకాయిలు చెల్లించాలి




**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని రిమ్స్ సెక్యూరిటీ కార్మికుల రెండు నెలల బకాయి వేతనాలు చెల్లించాలని, లేని పక్షంలో పోరాటాలు ఉధృతం చేస్తామని సిటు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు బి.మురళి, సిటు టౌన్ కన్వీనర్ ఆర్.ప్రకాశరావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రిమ్స్ కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (సిటు) ఆధ్వర్యంలో మంగళవారం గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ సెక్యూరిటీ కార్మికుల రెండు నెలల బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని, కార్తికేయ సెక్యూరిటీ కాంట్రాక్టర్ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ వద్ద కార్మికులు ఖాళీ కంచాలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్తికేయ సెక్యూరిటి ఏజెన్సీ కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, కార్మికుల సమస్యల పరిష్కరించాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా యంత్రాంగం వెంటనే జోక్యం చేసుకొని కార్మికుల బకాయి వేతనాలు వెంటనే చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం రిమ్స్ సూపరింటెండెంట్ సి.అమూల్యకు యూనియన్ ప్రతినిధులు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో రిమ్స్ యూనియన్ నాయకులు టి.రామారావు, ఎం.సూర్యనారాయణ, కె.రవి, సంతోషి, సావిత్రి, కృష్ణవేణి, ఎ.సూర్యనారాయణ, బి.అప్పన్న, రాజేంద్ర, జి.అప్పన్న, పి.సతీష్, జి.లక్ష్మణరావు, హైమారావు, రవి, సంతు, రాజేశ్వరి, బండారమ్మ పాల్గొన్నారు.

## మత్స్యకారులను కలిసిన కృష్ణచైతన్య



**(సత్యంన్యూస్, పోలాకి)**

గుప్పిడిపేట గ్రామంలో మత్స్యకార కుటుంబాలను యువ నాయకులు డాక్టర్ ధర్మాన కృష్ణ చైతన్య కలిశారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడుతూ భారీ వర్షాలు పడుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈయనతో పాటు ఎంపీపీ ముద్దాడ బైరాగినాయుడు, మండల అధ్యక్షులు కణితి కృష్ణారావు, రాష్ట్ర యూత్ సంయుక్త కార్యదర్శి చింతు రాఘవరావు, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు కళ్లేపల్లి లక్ష్మణరావు, రాష్ట్ర మాజీ డైరెక్టర్ లండ ఎర్రయ్య, సర్పంచ్ పైడి తాత, ఎంపిటిసి తులే పైడమ్మ, మండల కార్యవర్గ సభ్యులు నందుపల్లి పైడయ్య పాల్గొన్నారు.

## విజయవంతమైన నేత్ర వైద్య శిబిరం

**(సత్యంన్యూస్, సంతబొమ్మాళి)**

నారాయణ కమలం శ్రేయోనిధి వారి ఆధ్వర్యంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ శ్రీకాకుళం సౌజన్యంతో నౌపడ గ్రామంలోని రామ మందిరంలో శంకర్ ఫౌండేషన్ ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించింది. 120 మందికి కంటి పరీక్షలు జరిపి, 40 మందికి కేటరాక్ట్ శస్త్ర చికిత్సలు అవసరమని నిర్ధారించారు. వీరిని శస్త్ర చికిత్సలకు శ్రీకాకుళం శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ పరిమళ, ఆప్తాల్మిక్ అధికారి ఎమ్ఆర్‌కె దాస్, శంకర్ ఫౌండేషన్ ఆప్టోమెట్రిస్ట్ ఎస్.అంజలి, నారాయణ కమలం శ్రేయోనిధి కమిటీ సభ్యులు చెన్నూరు విజయానందరాజు, చెన్నూరు వైకుంఠరావు, లోపింటి జయకృష్ణారెడ్డి, చెన్నూరు దుర్గారావు, రేజేటి వెంకట రమణాచార్యులు, క్యాంప్ కోఆర్డినేటర్ టి.రామారావు, వైద్యఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.




## పెద్దగనగళ్లవానిపేటలో వైద్యశిబిరం



**(సత్యంన్యూస్, శ్రీకాకుళం రూరల్)**

తీవ్ర వర్షాల ప్రభావంతో నదీ తీర గ్రామం, సముద్ర తీర గ్రామం అయిన శ్రీకాకుళం మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో పెద్దగనగళ్లవానిపేటలో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యాధికారులు డాక్టర్ టి.చిరంజీవినాయుడు, డాక్టర్ నమ్రతాప్రియ ఆధ్వర్యంలో ప్రజలకు వైద్యపరీక్షలు జరిపి, ఉచితంగా మందులు అందించారు. గ్రామంలో ఇంటింటా జ్వరాల సర్వేతో పాటు లార్వా సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్త్ అసిస్టెంట్ ఇప్పిలి చిట్టిబాబు మాట్లాడుతూ వర్షాల కారణంగా తాగునీరు కలుషితమై విషజ్వరాలకు గురయ్యే ప్రమాదం ఉందని, ముందు జాగ్రత్తగా కాచి చల్లార్చి వడకట్టిన నీటినే తాగాలని, తరచూ సబ్బుతో చేతులు కడుక్కోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ, దోమల వృద్ధి నివారణకు ఇంటి చుట్టుపక్కల వర్షం నీరు నిలువ లేకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ సోనియా, ఏఎన్ఎమ్ రోజా, సచివాలయం కార్యదర్శి వెంకటరమణ, ఆశా కార్యకర్తలు వరలక్ష్మీ, వసుమతి పాల్గొన్నారు.

## ఫొటోగ్రాఫర్లు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

- **ఫొటో అండ్ వీడియో గ్రాఫర్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మెట్ట నాగరాజు**
- **నటరాజ్ ఫొటో ఎంపోరియంలో ఫొటోగ్రఫీ డే**



**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

ఫోటోగ్రాఫర్లు ప్రస్తుత పరిస్థితుల్లో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని, ఈ సమస్యలన్నిటికీ పరిష్కారంగా ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవడంలో ముందుండాలని, అప్పుడే మరి కొంత కాలం ఈ ఫోటోగ్రఫీ వృత్తిలో కొనసాగగలమని ఫోటో అండ్ వీడియో గ్రాఫర్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మెట్ట నాగరాజు అన్నారు. ప్రపంచ 186వ ఫోటోగ్రఫీ డే పాలకొండ రోడ్‌లోని నటరాజ్ ఫొటో ఎంపోరియంలో శ్రీకాకుళం ఫోటోగ్రాఫర్ల సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షులు పక్కి వేణుగోపాలరావు ఆధ్వర్యంలో అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం పట్టణ ఫోటోగ్రాఫర్లు సింధు శ్రీను, మహావీర వెంకటేష్, రవి, శ్రీరామ్‌మూర్తి, యుగంధర్, వెంకట్, చిరంజీవి, సురేష్, భానుమూర్తి, హేమసుందర్, పట్టణ ఫోటోగ్రాఫర్లు పెద్ద ఎత్తున హాజరయ్యారు.














# నియామకాల్లో నిబంధనలు 'అవుట్'!

(మొదటిపేజీ తరువాయి)

ఆరోపణలు వినిపిస్తున్నాయి. దేవస్థానానికి అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన 46 మందిని సమకూర్చే బాధ్యతను ఏజెన్సీలకు అప్పగించేందుకు అధికారుల ఈ-టెండర్లు ఆహ్వానించారు. ఆ మేరకు ఆరు ఏజెన్సీల తరఫున టెండర్లు దాఖలు కాగా.. సోమవారం వాటిని తెరిచారు. దానికి ముందే జీరో పర్సంట్ కోట్ చేసిన టెండర్లు చెల్లవని ఆలయ ఈవో ప్రకటించారు. నిబంధనల ప్రకారం అవుట్ సోర్సింగ్ టెండర్లు వేసిన వారు కచ్చితంగా ఒకటి నుంచి 5 శాతం కమీషన్ కోట్ చేయాలి. అయితే టెండర్లు తెరిచిన అనంతరం జీరో పర్సంట్ కోట్ చేసిన వీఆర్ఎస్ చంద్రశేఖరరావు ప్రాతినిధ్యం వహించిన గిరీశం టెక్నికల్ సర్వీసెస్‌కు చెందిన టెండర్‌ను కూడా ఈవో అనుమతించారు. దీనిపై ఆరసవల్లికి చెందిన ఎస్-ఎస్ సెక్యూరిటీస్ ప్రతినిధులు అభ్యంతరం తెలిపినా ఈవో పట్టించుకోకుండా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**అయినవారికి ధారాదత్తం చేసేలా..**

స్థానిక యువతకు ఉపాధి లభిస్తుందన్న ఉద్దేశంతో ఎస్ఎస్ సెక్యూరిటీ పేరుతో ఒక్క శాతం మాత్రమే కమీషన్ కోట్ చేస్తూ టెండర్ దాఖలు చేసినట్లు అరసవల్లికి చెందిన యువకులు చెబుతున్నారు. కానీ ఈవో ఏకపక్షంగా వ్యవహరించి విశాఖలోని మానసస్ ట్రస్టులో అవుట్ సోర్సింగ్ కాంట్రాక్టర్ చంద్రరావును తీసుకువచ్చి నిబంధనలకు విరుద్ధంగా టెండర్ కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. టెండర్లు తెరవకముందు ఒకలా.. తెరిచిన తర్వాత మరోలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. జీరో కమీషన్‌తో వేసిన టెండర్లను అంగీకరించేది లేదని మొదట ప్రకటించిన ఈవో ఆ తర్వాత తనకు పరిచయమున్న వ్యక్తిని తీసుకువచ్చి టెండర్ కట్టబెట్టేయడానికి ప్రయత్నిస్తున్నారని వారు ఆరోపించారు. ఈవో ఏకపక్ష నిర్ణయం వల్ల స్థానికులమైన తమకు ఉపాధి దూరమైందని ఆవేదన వ్యక్తంచేశారు. టెండర్ నిబంధనలను ఈవో పాటించలేదని స్థానిక యువత అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఆరోపణలు రావడంతో ఈవో కొత్త పల్లవి అందుకున్నారు. బిడ్లు అన్నింటినీ దేవదాయశాఖ కమిషనర్‌కు పంపిస్తానని అంటున్నారు. నిబంధనల ప్రకారం కనీస రేట్ కోట్ చేసిన రెండు బిడ్లను మాత్రమే వెరిఫికేషన్ కోసం ఉన్నతాధికారులకు పంపించాలి. అలా కాకుండా అన్నింటినీ పంపిస్తానని చెప్పడం ద్వారా జీరో కమీషన్ కోట్ చేసిన వ్యక్తికి టెండరు కట్టబెట్టేందుకు ఈవో కుట్ర పన్నుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాగా స్థానిక యువతకు ఉపాధి లభించేలా ఒక్క శాతం కమీషన్‌తో దాఖలైన టెండర్‌ను ఖరారు చేయాలని ఎమ్మెల్యే గొండు శంకర్ ఈవోకు సూచించినట్టు తెలిసింది. అయితే దీనిపై ఈవో ఇప్పటివరకు స్పందించలేదని అంటున్నారు.

# కేన్సర్ బాధితునికి 'మాతృభూమి' సాయం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఆపదలో ఉన్నవారికి అండగా మాతృభూమి సేవా సంఘం సాయమందించింది. సంఘం అధ్యక్షులు ప్రతాప్, కోశాధికారి లక్ష్మణ్ ఆధ్వర్యంలో నెలకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేశారు. అంపోలుకు చెందిన ఉట్ల హేమంత్ కుమార్ గత కొంత కాలంగా లివర్‌కు సంబంధించిన వ్యాధితో బాధపడుతున్నారు. హేమంత్‌కు మూడు నెలలకు సరిపడే నిత్యావసర సరుకులతో పాటు రైస్ ప్యాకెట్‌లను కేన్సర్ బాధితునికి అందించి మానవత్వం చాటుకున్నారు. ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న తమకు సహాయం చేసిన మాతృభూమి సేవా సంఘం టీమ్ సభ్యులకు హేమంత్ కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సభ్యులు చంద్ర తదితరులు పాల్గొన్నారు.

# శాంతియుత పోరాటానికి సిద్ధం కండి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఎస్సీ వర్గీకరణ దళితుల ఐక్యతపై దేశవ్యాప్త చరిత్రలోనే మోడీ రాజకీయ కుట్ర పన్నారని మాల మహానాడు అండ్ రాక్స్, నేషనల్ ప్రెసిడెంట్ డా.ఆర్ఎస్ రత్నాకర్ మంగళవారం అన్నారు. స్థానిక ప్రైవేట్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో జాతీయ మాలమహానాడు అధ్యక్షులు డాక్టర్ ఆర్ఎస్ రత్నాకర్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణను పంజాబ్, హర్యానాలో మొట్టమొదటిగా ఈ దేశంలో చేసింది కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమేనని, బీజం కాంగ్రెస్ పార్టీ వేస్తే, దేశం మొత్తం మోడీ అమలుపరిచారని విమర్శించారు. ఇది దళితుల ఐక్యతపై కుట్ర అని, చంద్రబాబు మాల సామాజిక వర్గంపై పగతీర్చుకుంటున్నారని, మాలలకు అన్యాయం జరుగుతున్నా నేటికీ స్పందించలేదన్నారు. తెలుగు రాష్ట్రాల్లో అన్ని రాజకీయ పార్టీలు, మాల సామాజిక వర్గాన్ని తొక్కేస్తుంటే మాల ప్రజాప్రతినిధులు నోరు మెదపకపోవడం అన్యాయమన్నారు. రిజర్వేషన్లలో లబ్ధి పొందిన మాల ఉద్యోగులు ఇకనైనా కళ్లు తెరిచి బయటకు వచ్చి, పోరాటానికి మద్దతు పలకాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో డాక్టర్ అలికాన మహేష్ కుమార్, యామల కృష్ణ, బొచ్చా శశిభూషణరావు, కాకర రవితేజ, కూసి కొండబాబు, నెల్లి సూరిబాబు, నూకరాజు, కనికెళ్ల నాని తదితరులు పాల్గొన్నారు.

# గిరీష్‌కు రెవెన్యూ సిబ్బంది సన్మానం



(సత్యంన్యూస్, కొత్తూరు)

కర్లెమ్మ రెవిన్యూ పరిధిలో దాదాపు 70 శాతం సమస్యల పరిష్కారానికి కృషి చేసి, ఉత్తమ వీఆర్వోగా రాష్ట్రమంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చేతుల మీదగా ప్రశంస పత్రం అందుకున్న వీఆర్వో గిరీస్‌కు మండల కేంద్రంలోని రెవెన్యూ సిబ్బంది ఘనంగా సన్మానించారు. దుశ్శాలువ కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి, ఆయనను కొనియాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాలకృష్ణ, సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

# బ్యాంకు కట్టల్లోనే నకిలీ పాములు?

మొదటిపేజీ తరువాయి

వారిచ్చిన నోట్లలో నకిలీవి ఉన్నాయంటూ గొడవపడ్డాడు. అటువంటివి బయటపడినప్పుడు బ్యాంకు వద్దే చూసుకోవాలని, ఇప్పుడు నోట్లు చించేసి తమ తప్పిదమంటే ఊరుకునేది లేదని బ్యాంకు సిబ్బంది దబాయించడంతో చేసేదిలేక వెనుదిరిగాడు.

**అలా వెళ్లింది ఫిర్యాదు**

గత కొద్దికాలంగా అనేక బంగారం షాపులకు ఇటువంటి నకిలీ నోట్లే రావడంతో.. ఈ వ్యవహారం ఏదో ఒకరోజు కొంప ముంచుతుందని భావించిన వర్తకులు కార్పొరేట్ స్థాయిలోనే డీజీపీ కార్యాలయానికి ప్రాథమికంగా ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. శ్రీకాకుళం లాడ్జిలో నకిలీ నోట్లు చెలామణీ చేస్తూ కొందరు దొరకడం.. బంగారం షాపులకు బ్యాంకు సీల్‌తో వస్తున్న నోట్ల కట్టల్లో నకిలీవి ఉంటున్నాయని ఫిర్యాదు అందిన నేపథ్యంలో అసలు నకిలీ నోట్ల చెలామణీ బ్యాంకుల నుంచి జరుగుతున్నదని ప్రాథమికంగా నిర్ధారించుకున్న తర్వాత ఎస్పీ ఆధ్వర్యంలోని ఓ పోలీస్ బృందం మూడు రోజుల నుంచి నగరంలో ఒక బ్యాంకు ఏడు బ్రాంచీల నగదు నిల్వ ఉంచే చెస్ట్‌లను తనిఖీ చేసినట్టు సమాచారం. అయితే వేలాది నోట్ల కట్టలను బయటకు తీసి లెక్కించడం, వాటిలో నకిలీలను గుర్తించడం పోలీసుల వల్ల అయ్యే పనికాదు. కాకపోతే బ్యాంకుల మీద కూడా పోలీసుల నిఘా ఉందని చెప్పడానికే ఇటువంటి తనిఖీలు చేపట్టినట్లు అర్థమవుతుంది.

**ఎప్పట్నుంచో ఆరోపణలు**

ముఖ్యంగా ఏటీఎంలలో లోడ్ చేస్తున్న నగదులో కొంతమేరకు నకిలీ నోట్లను బ్యాంకులే పెడుతున్నాయన్న ఆరోపణలు ఎప్పట్నుంచో ఉన్నాయి. ఎందుకంటే ఏటీఎంల నుంచి తక్కువ మొత్తంలో విత్‌డ్రాలు జరుగుతుంటాయి. కాబట్టి ఆ తక్కువ నోట్లలో ఒక్క ఫేక్ నోట్ వచ్చినా ఇట్టే తెలిసిపోతుంది. చాలామంది కస్టమర్లు తాము ఏటీఎంలలో తీసిన డబ్బుల్లో ఫేక్ నోట్లు వస్తున్నాయని పేర్కొన్న సందర్భాలు కోకొల్లలు. అయితే అవన్నీ పోలీసుల ఫిర్యాదు వరకు వెళ్లవు. ఉదాహరణకు ఏదైనా ఒక బ్యాంకు నుంచి రూ.2 లక్షలు విత్‌డ్రా చేస్తే సంబంధిత క్యాషియర్ నాలుగు ఐదువందల నోట్ల కట్టలు ఇచ్చాడనుకుందాం. అప్పటికే బ్యాంకు రద్దీగా ఉండటం వల్ల కొందరు బ్యాంకు సీలు ఉంది కదా అన్న నమ్మకంతో లెక్క బెట్టకుండానే నాలుగు కట్టలు పట్టుకొని వెళ్లిపోతారు. మరికొందరైతే రెండు లక్షలకు సరిపోను నోట్లు ఉన్నాయా, లేవా అని చూసుకుంటారు. కానీ వాటిలో ఫేక్ గుర్తించడం కస్టమర్ తరం కాదు. వాస్తవానికి పెద్దమొత్తం విత్‌డ్రా చేసినప్పుడే సంబంధిత క్యాషియరే కౌంటింగ్ మిషన్‌లో నోట్లు పెట్టినప్పుడు కస్టమర్‌కు చూపించి అంతా ఓకే అనుకున్న తర్వాత దానికి సీల్ వేసి సంతకం చేసి ఇవ్వాలి. కానీ బ్యాంకులో కస్టమర్ల తాకిడి ఎక్కువగా ఉంటుండటం వల్ల తాము ఆ పని చేయలేమని ముందుగానే బండిల్ చేసిన నోట్లపై బ్యాంకు పేపరు చుట్టేసి, సంతకం ఎవరిదో తెలీని విధంగా కొక్కిరిగీత గీసేసి, చెకింగ్ అయిపోయిందంటూ నిర్ధారించామని సిబ్బంది చెబుతుంటారు. వాస్తవానికి ఇక్కడి నుంచే ఫేక్ నోట్లు, తక్కువ కౌంటింగ్ ఆరోపణలు వస్తున్నాయి. ఒకసారి టెల్లర్ కౌంటర్‌ను విడిచిపెట్టి బయటకు వెళ్లిపోయిన తర్వాత వేరే బ్యాంక్‌కు ఆ బండిల్‌ను ఇచ్చినప్పుడు అక్కడి బ్యాంకు సిబ్బంది తక్కువ నోట్లు ఉన్నాయనో, కొన్ని ఫేక్ కనిపిస్తున్నాయనో చెబితే అటువంటివన్నీ తమ బ్యాంకు ఆవరణలోనే చెక్ చేసుకోవాలని చెబుతుండటంతో ఎవరూ ఏమీ చేయలేకపోతున్నారు.

**పలు ఎస్బీఐ శాఖల్లో పరిశీలన**

ఏ బ్యాంకు లేదా వ్యాపార సంస్థ వద్దకు ఫేక్ నోట్లు వచ్చినా అక్కడికక్కడే కస్టమర్‌కు చూపించి చింపేస్తారు. కానీ ఎప్పుడైనా పోలీసు అధికారులకు అనుమానం వచ్చి ఈమధ్య కాలంలో ఏవైనా ఫేక్ నోట్లు బ్యాంక్ లావాదేవీల్లో వచ్చాయా? అని అడిగితే అనేక బ్యాంకులు, పెద్ద పెద్ద సంస్థలు వచ్చాయని, వాటిని చింపేశామని పోలీసులకు చెబుతాయి. కానీ జిల్లాలో ఒక్క ఎస్బీఐ మాత్రం తమ దృష్టికి ఇంతవరకు ఒక్క ఫేక్ నోట్ కూడా రాలేదని పోలీసులకు చెప్పడం అనేక అనుమానాలకు తావిస్తోంది. వాస్తవానికి ఎస్బీఐ ఏటీఎంలలోనే తమకు ఫేక్ కరెన్సీ వచ్చిందన్న కస్టమర్లు చాలామంది ఉన్నారు. అలాగే ఎస్బీఐ ఇచ్చిన నోట్ల కట్టల్లో తక్కువ నోట్లు ఉన్నాయని ఒక్కోసారి, ఫేక్ నోట్లు వచ్చాయని మరికొన్నిసార్లు కస్టమర్లు అనేక బ్రాంచిల్లో గొడవ పడిన సందర్భాలూ కోకొల్లలు. సీసీ టీవీ ఫుటేజీ పరిశీలిస్తే ఇవన్నీ బయటపడతాయి. కానీ దీనికి భిన్నంగా తమ వద్ద ఫేక్ నోట్ల సొండే లేదని ఎస్బీఐ చెప్పడంతో జిల్లా పోలీసులకు అక్కడే అనుమానం బలపడింది. దాంతో అరసవల్లి జంక్షన్, ఆర్ట్స్ కాలేజీ రోడ్డు, విశాఖ-బి కాలనీ, రణస్థలం, గోవిందపురం, పలాస, కవిటి, సారవకోట బ్రాంచిలను వారు పరిశీలించినట్టు ప్రచారం జరుగుతోంది. అయితే ఇది ఎంతవరకు వాస్తవమనేది పోలీసు అధికారులే చెప్పాలి.

**ఇతర బ్యాంకులకూ చేదు అనుభవాలు**

గతంలో ఏపీజీవీబీకి స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియాలో అకౌంట్ ఉండేది. తమకు అవసరమైన నగదును ప్రతిరోజూ ఎస్బీఐ నుంచే విత్‌డ్రా చేసి ఏపీజీవీబీ పట్టుకెళ్లేది. ఎస్బీఐ మీద నమ్మకంతో బండిల్ మీద ఉన్న ఎస్బీఐ సీల్‌ను చించేసి ఏపీజీవీబీ పేపరు అతికించి కస్టమర్‌కు ఇచ్చేవారు. ఈ కట్టల్లో నోట్లు తక్కువ రావడం, ఉన్నవాటిలో కొన్ని నకిలీవి ఉన్నట్లు గ్రామీణ వికాస్ బ్యాంకు కస్టమర్లు ఫిర్యాదులు చేయడంతో ఎస్బీఐ నుంచి డబ్బులు తీసుకురావడానికి ఏపీజీవీబీ ఫుల్‌స్టాప్ పెట్టేసింది. అలాగే మరికొన్ని బ్యాంకులు కూడా ఎస్బీఐ డబ్బు కట్టలు ఇవ్వగానే సొమ్ము ముట్టిందని గుడ్డిగా సంతకం పెట్టి వచ్చేయకుండా తమ బ్రాంచికి పట్టుకెళ్లి మిషన్‌లో పెట్టి నకిలీవి ఎన్నో, ఫేక్ ఎన్నో తేలాక రెమిటెన్స్ ఇచ్చేవారు. దీంతో మిగిలిన బ్యాంకులకు సొమ్ములు ఇచ్చేటప్పుడు వచ్చే ఫిర్యాదులు ఈమధ్య కాలంలో తగ్గాయి. ఇటీవల ఒక వ్యక్తి నరసన్నపేట ఎస్బీఐ నుంచి విత్‌డ్రా చేసిన నోట్ల కట్టను గుజరాతీపేట ఎస్బీఐలో లోన్ రీపేమెంట్‌కు చెల్లిస్తే వాటిలో మూడు నోట్లు తక్కువ ఉన్నాయని బ్యాంకు సిబ్బంది తేల్చారు. దీనిపై కస్టమర్ గొడవ పెట్టినా ఫలితం దక్కలేదు. ప్రస్తుతానికి ఒకప్పటి మాదిరిగా కాకుండా రాష్ట్రవ్యాప్తంగా నకిలీ నోట్ల చెలామణీ, ముద్రణ గణనీయంగా తగ్గింది. కాకపోతే గతంలో ముద్రించిన నోట్లను మార్కెట్లోకి వదలడానికి కొన్ని బ్యాంకుల సిబ్బందే ఫేక్ సృష్టికర్తలతో చేతులు కలపడం వల్ల ఖాతాదారులు నష్టపోతున్నారు.

# విపక్షాల ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి



(సత్యం ఐటీ డెస్క్)

ఉపరాష్ట్రపతి ఎన్నికకు సంబంధించి జాతీయ స్థాయిలో విపక్ష కూటమి కీలక నిర్ణయం తీసుకుంది. తమ అభ్యర్థిగా సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి పేరును ఖరారు చేసింది. ఈమేరకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రకటన చేశారు. ఇందుకు విపక్ష పార్టీలన్నీ మద్దతు తెలిపాయన్నారు. ఎన్డీయే అభ్యర్థి రాధాకృష్ణన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని అధికార పక్షం విజ్ఞప్తి చేసిన సమయంలోనే విపక్ష పార్టీలు తమ అభ్యర్థిని ప్రకటించాయి.

'దేశంలోని ప్రఖ్యాత న్యాయనిపుణుల్లో బి.సుదర్శన్ రెడ్డి ఒకరు. ఆంధ్రప్రదేశ్, గువాహటి హైకోర్టులతో పాటు సుప్రీంకోర్టులో సేవలందించారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయంపై స్పష్టమైన అవగాహన కలిగిన వ్యక్తి. ఉమ్మడి అభ్యర్థిని నిలబెట్టాలని ఇండియా కూటమిలోని పార్టీలన్నీ ఓ అభిప్రాయానికి వచ్చి ఏకగ్రీవంగా ఈ నిర్ణయం తీసుకున్నాయి' అని ఖర్గే పేర్కొన్నారు. ప్రతిపక్షాలన్నీ ఒకే పేరును అంగీకరించడం ఎంతో సంతోషంగా ఉందని, ఇది ప్రజాస్వామ్యానికి అతిపెద్ద విజయమన్నారు.

**ఉస్మానియా వర్సిటీ నుంచి..**

జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి స్వస్థలం తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా ఆకులమైలారం. 1946 జులైలో జన్మించిన ఆయన 1971లో ఉస్మానియా యూనివర్సిటీలో లా పూర్తి చేశారు. అనంతరం అదే ఏడాది డిసెంబర్ 27న బార్ కౌన్సిల్‌లో నమోదు చేసుకున్నారు. 1995 మే 2న ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2005లో గువాహటి హైకోర్టు సీజేగా పని చేశారు. 2007-11 మధ్య సుప్రీంకోర్టు జడ్జిగాను సేవలందించిన ఆయన.. 2013 మార్చిలో గోవా తొలి లోకాయుక్తగా బాధ్యతలు స్వీకరించారు. వ్యక్తిగత కారణాలతో ఏడు నెలల్లోనే ఆ పదవికి రాజీనామా చేశారు.

మరోవైపు ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్‌ను ప్రకటించిన ఎన్డీయే.. ఆ ఎన్నికను ఏకగ్రీవం చేయాలని ప్రయత్నాలు చేసింది. ఇందులో భాగంగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ఫోన్ చేసి మద్దతు ఇవ్వాలని కోరినట్లు సమాచారం. అంతకుముందు బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా కూడా రాధాకృష్ణన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని విపక్షాలకు విజ్ఞప్తి చేశారు. తాజాగా విపక్షాలు కూడా అభ్యర్థిని ప్రకటించడంతో రాధాకృష్ణన్, జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డిల మధ్య పోటీ అనివార్యమైంది.

# తీరం దాటిన వాయుగుండం

**ఉత్తరాంధ్రలో మోస్తరు నుంచి భారీ వర్షాలు**

(సత్యంన్యూస్, విశాఖపట్నం)

వాయువ్య పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తీరం దాటింది. ఒడిశాలోని గోపాల్‌పూర్‌కి సమీపంలో తీరం దాటినట్లు విశాఖ వాతావరణ కేంద్రం వెల్లడించింది. గడిచిన ఆరు గంటల్లో 7 కి.మీ వేగంతో వాయుగుండం కదిలినట్లు అధికారులు వెల్లడించారు. దీని ప్రభావంతో ఉత్తరాంధ్రలో అక్కడక్కడా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, గంటకు 35-45 కి.మీ వేగంతో గాలులు వీచే అవకాశమున్నట్లు వాతావరణ కేంద్రం వెల్లడించింది. మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ సూచించారు.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.